## ఉచిత వైద్య శిబిరం

కామాక్షి బ్రాహ్మణ సంఘం నిజాంపేట ఆధ్వర్యంలో నిజాంపేట రోడ్డులోని పూజిత ఎన్‌క్లేవ్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మంజు దవాఖాన వైద్యులు, సిబ్బంది శిబిరానికి వచ్చిన వారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. గైనకాలజీ, డయాబెటీస్, ఈసీజీ, జనరల్ మెడిసిన్ విభాగాల్లో వైద్య పరీక్షలు చేపట్టి.. ఆరోగ్యవంతమైన జీవనం కోసం పాటించాల్సిన నియమాలను వైద్యులు సూచించారు. కార్యక్రమంలో కామాక్షి బ్రాహ్మణ, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

– మియాపూర్, జూన్ 23



## జంట సర్కిళ్ల కార్యాలయంలో నేడు ప్రజావాణి

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 23 : కూకట్‌పల్లి, మూసాపేట జంట సర్కిళ్ల కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న 'ప్రజావాణి'ని సద్వినియోగం చేసుకోవాలని ఉపకమిషనర్లు రమేశ్, కృష్ణయ్య తెలిపారు. మూసాపేటలోని జీహెచ్‌ఎంసీ జంట సర్కిళ్ల కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 'ప్రజావాణి' కొనసాగుతుందన్నారు. ఆయా సర్కిళ్ల పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజావాణిలో ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

## ఓల్డ్‌బోయిన్‌పల్లి అభివృద్ధిపై నేడు సమీక్ష

బాలానగర్, జూన్ 23 : ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ అభివృద్ధిపై అన్ని విభాగాల అధికారులతో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు కార్పొరేటర్ ముద్ద నర్సింహ యాదవ్ తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు ఓల్డ్‌బోయిన్‌పల్లి వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో పాటు వివిధ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలు, బస్తీల అసోసియేషన్ సభ్యులు హాజరై సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించడానికి వీలుగా ఉంటుందని ఆయన పిలుపునిచ్చారు.

# పేదల పెన్నిధి సీఎం సహాయ నిధి



సీఎం సహాయ నిధి సాయం మంజూరు పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే గాంధీ



సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే గాంధీని కలిసిన గోకుల్ ప్లాట్స్ కాలనీ ప్రతినిధులు

**ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ**

మియాపూర్, జూన్ 23 : సీఎం సహాయ నిధి పేదల ఆరోగ్యానికి పెన్నిధిలా ఉపయోగపడుతున్నదని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. నిరంతరం తన సేవలతో ఎంతో భరోసానిస్తున్నదన్నారు. హైదర్‌నగర్ డివిజన్ నిజాంపేటకు చెందిన గుడిపూడి వెంకటరావుకు సీఎం సహాయనిధి పథకం కింద మంజూరైన రూ.1.50లక్షల ఆర్థిక సాయం పత్రాలను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్యే గాంధీ ఆదివారం తన నివాసంలో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం సహాయనిధి పథకం సాయంతో కార్పొరేట్ దవాఖానలో ఉచిత వైద్యం పొందవచ్చునన్నారు. ఆపదల సమయంలో తగు ఆర్థిక తోడ్పాటుతో ఆపన్న హస్తాన్ని అందిస్తున్నదని, పేదలెందరో ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని తమ అనారోగ్యాలను నయం చేసుకున్నారని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు.

**కాలనీలకు అండగా ఉంటా...**

మాదాపూర్ డివిజన్ గోకుల్ ప్లాట్స్ కాలనీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, పరిష్కరించాల్సిన సమస్యలపై ఎమ్మెల్యే గాంధీని ఆదివారం కాలనీవాసులు ఆయన నివాసంలో కలిసి విన్నవించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీలో పూర్తి స్థాయిలో సీసీ రహదారుల నిర్మాణాలు చేపట్టి సౌకర్యవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తామన్నారు. కాలనీలకు అండగా ఉండి మౌలిక వసతుల కల్పనకు అనునిత్యం కృషి చేస్తానని కాలనీ వాసులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బ్రిక్ శ్రీనివాస్, శ్రీనివాస్, పూర్ణ, గోవింద్, శ్యామ్‌కుమార్, శ్రీనివాస్, రోజా, రమణ పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు



ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును కలిసిన పార్టీ కార్యకర్తలు,ప్రజలు

దుండిగల్, జూన్ 23: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు శంభీపూర్ రాజు అన్నారు. శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజలు, బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్సీని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ, తమ బస్తీలు, కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరగా.. ఎమ్మెల్సీ రాజు సానుకూలంగా స్పందించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా తాము నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పని చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.




## కాలుష్యం నుంచి చెరువులను కాపాడాలి



గోపన్‌పల్లి పెద్దచెరువులో నీరు కలుషితమై మృత్యువాతపడ్డ చేపలను మత్స్యకారులు, గ్రామస్తులతో కలిసి పరిశీలిస్తున్న గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

శేరిలింగంపల్లి, జూన్ 23:చెరువుల్లో డ్రైనేజీ నీరు కలిసి కలుషితం కాకుండా చర్యలు తీసుకొని వాటిని కాలుష్యం నుంచి కాపాడాల్సిన అవసరం ఉందని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి అన్నారు. ఆదివారం గోపన్‌పల్లితండా గ్రామస్తులతో కలిసి ఆయన పెద్ద చెరువును సందర్శించి పరిశీలించారు. చెరువులో కలుషిత నీటితో చేపలు మృత్యువాత పడ్డాయని, మత్స్యకారులకు తీవ్ర నష్టం జరిగిందని గ్రామస్తులు ఈ సందర్భంగా వాపోయారు. పెద్దచెరువులో గోపన్‌పల్లి గ్రామానికి చెందిన డ్రైనేజీ నీరు కలువడంతో చెరువునీరు కలుషితమై విషపూరితంగా మారాయని, దీంతో చేపలు మృతి చెందినట్లు కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి పేర్కొన్నారు. గతంలో పలుమార్లు సంబంధిత అధికారులకు ఈ విషయమై ఫిర్యాదులు చేసినప్పటికీ వారు పట్టించుకోలేదని, చెరువులో డ్రైనేజీ నీరు కలువకుండా తగు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని ఆరోపించారు. మత్స్యకారులకు న్యాయం జరిగేలా చూస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోపన్‌పల్లి గ్రామస్తులు రంగస్వామి, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న మహిళా భక్తులతో ఎమ్మెల్యే వివేకానంద్

## విజయదుర్గా ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

దుండిగల్,జూన్23:కుత్బుల్లాపూర్ నియోజకవర్గం,గాజులరామారం డివిజన్(సర్కిల్) పరిధి,మిథిలానగర్‌లోని శ్రీ విజయదుర్గాదేవి అలయం 7వ వార్షిక వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి.వేడుకలకు కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కేపీ.వివేకానంద ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మవారి కృపాకటాక్షంతో ప్రజలందరు సుఖసంతోషాలతో జీవించాలని అభిలషించారు.వేడుకల్లో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజుయాదవ్,బీఆర్‌ఎస్ పార్టీ నిజాంపేట్ నగర అధ్యక్షులు రంగరాయప్రసాద్,దుండిగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాసరెడ్డి,శ్రీకర్‌గుప్తతో పాటు ఆలయకమిటీ సభ్యులు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లిలో పోలీసుల తనిఖీలు



కైత్లాపూర్ గ్రౌండ్‌లో పర్యవేక్షిస్తున్న డీసీపీ సురేశ్‌కుమార్, ఏసీపీ శ్రీనివాసరావు, సీఐ

మూసాపేట, జూన్23: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్ హెచ్చరించారు. ఈ మేరకు కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. నేరపూరిత ప్రాంతాల్లో నిఘాను ఏర్పాటు చేయాలని సూచించారు. కైత్లాపూర్ గ్రౌండ్, కేపీహెచ్‌బీకాలనీ మెట్రోస్టేషన్, భగ్యనగర్‌కాలనీ ప్రాంతాల్లో పోలీసులు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, సీఐ కృష్ణమోహన్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించండి



ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని షిరిడి నగర్ కాలనీ, విజయనగర్ కాలనీ, మొగులమ్మ కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి మౌలిక వసతులు కల్పించాలని ఆయా కాలనీలకు చెందిన ప్రజలు కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్‌ను ఆయన కార్యాలయంలో కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. దశలవారీగా సమస్యలను పరిష్కరించి తాగునీరు, రహదారులు, డ్రైనేజీలు, కమ్యూనిటీ హాళ్లు వంటి వసతులను కల్పిస్తామని హామీ ఇచ్చారు.

– మియాపూర్, జూన్ 23

## ఘనంగా తూడి ప్రవీణ్ జన్మదినం



ప్రముఖ వ్యాపారవేత్త, సంఘ సేవకుడు తూడి ప్రవీణ్ జన్మదిన వేడుకలు ఆయన కుటుంబ సభ్యులు, అభిమానుల మధ్య ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన షిరిడీ సాయి ఓల్డేజ్ హోమ్‌లో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, ప్రవీణ్‌లను గజమాలతో సత్కరించి కేక్‌కట్ చేయించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, గాలి అనిల్‌కుమార్, చందానగర్ డివిజన్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సుప్రజ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు. –శేరిలింగంపల్లి, జూన్ 23

## అలరించిన కూచిపూడి, భరతనాట్య నృత్య ప్రదర్శనలు



కొండాపూర్, జూన్ 23: వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనల్లో ఆదివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో పలువురు కళాకారులు కూచిపూడి, భరతనాట్య నృత్య ప్రదర్శనలతో అలరించారు. ఇందులో భాగంగా ఆదివారం కువైట్‌లో పుట్టి, పెరిగినప్పటికీ హిందూ సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ, సంప్రదాయ నృత్యమైన కూచిపూడిని ప్రముఖ గురువులు వేదవల్లి వద్ద శిక్షణను పొందిన అనన్య సూరపనేని తన కూచిపూడి నృత్య ప్రదర్శనతో ఆద్యంతం ఆకట్టుకున్నది. సరస్వతి వందన, కళాసాపురము కాదా, కృష్ణ లీలలు, ధనశ్రీ తిల్లాన అంశాలను ప్రదర్శించి ఆకట్టుకున్నది. అనంతరం శంకరానంద కళాక్షేత్రం గురువులు పద్మశ్రీ ఆనంద శంకర్ శిష్య బృందం పుష్పాంజలి, దేవి కీర్తనం, దశావతారం, తిల్లాన అంశాలను భరతనాట్య నృత్యరూపకంలో ప్రదర్శించి అలరించారు.

## సీసీ రోడ్డు పనుల పరిశీలన



శక్తినగర్‌లో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ శ్రావణ్‌కుమార్

మూసాపేట, జూన్23: డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మూసాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ కోరారు. డివిజన్ శక్తినగర్ నుంచి ఈడబ్ల్యూఎస్ వరకు జరుగుతున్న సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు ఆదివారం ఆయన పరిశీలించారు.శ్రావణ్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శంకుస్థాపన చేసిన పనులు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 6నెలలు గడిచినా పూర్తి చేయలేకపోతున్నారన్నారు. పేద ప్రజలు నివసించే ఈడబ్ల్యూఎస్ ప్రాంతంలో కాంట్రాక్టర్ రోడ్డు లెవల్ సరి చూసి వేయకపోవడంతో వర్షం పడినప్పుడు వర్షపునీరు ఇండ్లలోకి చేరే అవకాశం ఉందని స్థానికులు శ్రావణ్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఆయన అధికారులకు ఫోన్‌లో వివరించడంతో వారు సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, సీనియర్ నాయకులు ప్రసీద్‌రెడ్డి, తుకారాం, విష్ణు, చిరంజీవి, పాండు రంగారెడ్డి, శేషగిరి, సాయికృష్ణ పాల్గొన్నారు.

## వార్డుల్లోని సమస్యలు పరిష్కరించాలి

దుండిగల్, జూన్ 23 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకులు, దుండిగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణను ఆదివారం ఆయన కార్యాలయం వద్ద దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులకు చెందిన ప్రజలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలను కౌన్సిలర్ దృష్టికి వెళ్లి పరిష్కరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కృష్ణ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా తమ శుభ కార్యాలకు హాజరుకావాలంటూ ఆహ్వాన పత్రికలు అందజేశారు.

## అర్ధరాత్రి నిలిచిన విద్యుత్ సరఫరా

దుండిగల్, జూన్ 23: ప్రభుత్వం ఓ వైపు క్షణం కూడా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగడంలేదని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. భారీ వర్షాలు పడలేదు.. ఈదురుగాలులు అసలే వీయలేదు.. అయినా రెండు గంటలపాటు కరెంట్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇదెక్కడో మారుమూల ప్రాంతంలో కాదు.. మహానగరాన్ని ఆనుకుని ఉన్న నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిజాంపేట్ జర్నలిస్ట్స్ కాలనీ, మారుతీ ఎలైట్, బండారి లే అవుట్ కాలనీతోపాటు పరిసర ప్రాంతాల చోటు చేసుకున్నది. శనివారం అర్ధరాత్రి 1:37 గంటలకు కరెంట్ సరఫరా నిలిచిపోగా.. ఆదివారం తెల్లవారు జామున 3:35 గంటలకు కరెంట్ వచ్చింది. ఉక్కపోతతోపాటు దోమల స్వైరవిహారంతో నరకయాతనపడ్డారు. ఎట్టకేలకు తెల్లవారు జామున 3:35గంటలకు కరెంట్ రావడంతో ఊపిరి పీల్చుకున్నారు.

**వైర్లు తెగిపోవడంతోనే...**

కాగా, ఇదే విషయమై నిజాంపేట్ సబ్‌స్టేషన్ ఏఈ రాకేశ్‌ను వివరణ కోరగా.. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత మారుతీఎలైట్‌తో బండారి లేఅవుట్ కాలనీలకు సంబంధించిన కరెంట్ వైర్లు తెగిపోయాయని పేర్కొన్న ఆయన అవి ఎక్కడ తెగిపోయాయో తెలుసుకునేందుకు చాలా సమయం పట్టిందన్నారు. వాటిని గుర్తించిన పునరుద్ధరణ పనులు మొదలు పెట్టామని తెలిపారు.

## గచ్చిబౌలి స్టేడియంలో జాతీయ ఒలింపిక్ దినోత్సవం




గచ్చిబౌలి స్టేడియంలోని హాకీ క్రీడాప్రాంగణంలో జాతీయ ఒలింపిక్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాకీ తెలంగాణ అధ్యక్షుడు కొండావిజయ్‌కుమార్ హాజరై ఒలింపిక్ రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొద్దిరోజుల్లో పారిస్‌లో నిర్వహించే ఒలింపిక్ క్రీడల్లో హాకీతో పాటు ఇతర క్రీడల్లో తెలంగాణ క్రీడాకారులు రాణించాలన్నారు. కార్యక్రమంలో హాకీ తెలంగాణ సెక్రటరీ భీంసింగ్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల హాకీ సెక్రటరీ వేణుభాస్కర్‌రెడ్డి, కోచ్‌లు సోనీ, జ్యోతిలతోపాటు పలువురు హాకీ క్రీడాకారులు పాల్గొన్నారు. – శేరిలింగంపల్లి, జూన్ 23



'అంతర్జాతీయ ఒలింపిక్ డే'ను పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన ఒలింపిక్ రన్‌లో హైదర్‌నగర్ డివిజన్ రిషి మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు. క్రీడాస్ఫూర్తిని చాటి ప్రతిభను ప్రదర్శించేలా రన్ ఎంతో స్ఫూర్తినిచ్చిందని విద్యార్థినులు పేర్కొన్నారు. కళాశాల పీడీ జ్యోతి, విద్యార్థినులు పాల్గొన్నారు. – మియాపూర్, జూన్ 23

# పథకం ప్రకారమే భూ ఆక్రమణలకు యత్నం

- మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్
- 21 మందిని అదుపులోకి తీసుకున్నాం..



మియాపూర్ ఠాణాలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాదాపూర్ డీసీపీ వినీత్

మియాపూర్, జూన్ 23: మియాపూర్‌లో సర్వే నం.100, 101లలోని ప్రభుత్వ భూమిని పథకం ప్రకారం ఆక్రమించే ఉద్దేశంతోనే కొందరు ఈ చర్యలకు పాల్పడ్డట్లు తమ ప్రాథమిక విచారణలో తేలిందని మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్ పేర్కొన్నారు. సాధారణ ప్రజలను అడ్డం పెట్టుకుని కొంతమంది అలజడి సృష్టించే ప్రయత్నం చేశారని, ఇందుకు 50 మంది కారకులుగా గుర్తించామన్నారు. మియాపూర్ భూములపై నాలుగైదు రోజులుగా జరుగుతున్న సంఘటనల నేపథ్యంలో ఆదివారం రాత్రి మియాపూర్ ఠాణాలో మాదాపూర్ డీసీపీ విలేకరుల సమావేశం నిర్వహించారు. ముందస్తుగా కొందరు వ్యక్తులు పథకం ప్రకారం.. విలువైన ఈ భూమిని కాజేసేందుకే పేద ప్రజలకు ఇండ్ల స్థలాలిస్తున్నారన్న తప్పుడు ప్రచారంతో పెద్దఎత్తున ప్రజలను ఇక్కడికి తరలించారన్నారు. పోలీసు యంత్రాంగం నాలుగైదు రోజులుగా ఎంతో ఓపికతో సమన్వయంతో వ్యవహరించి అమాయకంగా వచ్చిన ప్రజలకు నచ్చజెప్పి పంపించామని, ఈ సందర్భంలో శనివారం కొందరు కావాలనే పోలీసులు, ఇతర అధికారులపై రాళ్లతో దాడి చేశారన్నారు. ఈ సంఘటనలో అధికారులకు గాయాలైనట్లు డీసీపీ పేర్కొన్నారు. సంఘటనపై కేసు నమోదు చేసుకుని తగు విచారణ చేపట్టగా, సుమారు 50 మంది వ్యక్తులు భూ ఆక్రమణకు యత్నించేందుకు స్థలాల పేరిట ప్రజలను తప్పుదోవ పట్టించి వేలాదిగా సర్వే నంబర్ 100, 101కు తరలించారన్నారు. చట్ట విరుద్ధంగా భూ ఆక్రమణకు పథకం పన్నిన 50 మందిలో ఇప్పటికే 21 మందిని అదుపులోకి తీసుకున్నట్లు, మిగితా వారు పరారీలో ఉన్నట్లు తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారిలో ఏడుగురు మహిళలు సైతం ఉన్నారన్నారు. వీరి వెనుక ఉండి చట్ట విరుద్ధంగా నడిపించిన వారినీ గుర్తించే పనిలో ఉన్నట్లు డీసీపీ తెలిపారు. ఈనెల 29వ తేదీ వరకు మియాపూర్, చందానగర్ ఠాణాల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పోలీసులపై రాళ్ల దాడికి పాల్పడ్డ వారిని గుర్తించినట్లు, త్వరలో వారిని అదుపులోకి తీసుకుని కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఇక్కడి సర్వే నంబర్లలో స్థలాలు ఇప్పిస్తామని కొందరు డబ్బులు వసూలు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. సమావేశంలో అదనపు డీసీపీ జయరాం, మియాపూర్ ఏసీపీ నర్సింహారావు ఉన్నారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో కుప్పాడి సంగీత, షేక్ మునీర్, లక్ష్మీబాయి, శ్రీనివాస్ నాయక్, లక్ష్మి, పైండ్ల లావణ్య, దొగిరి గౌరమ్మ, బ్యాగరి చంద్రమ్మ, పోలే లక్ష్మమ్మ, అశోక్ , నర్సింగరావు, గోపాల కృష్ణ, బాలకోటి, గోపాల్, సునీల్, గోవింద్, రమేశ్, ప్రేమ్‌కుమార్, మహేశ్, స్వామి, మున్న ఉన్నారు.





నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా వర్షం కురిసింది. దీంతో మల్కంచెరువు, హైటెక్ సిటీ, రాయదుర్గం, గచ్చిబౌలి బయోడైవర్సిటీ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.



కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్ పుట్టినరోజును పురస్కరించుకుని ఆదివారం శ్రీరామ్‌నగర్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. డివిజన్ ప్రజలు, నాయకులు, కార్యకర్తలు హాజరై కార్పొరేటర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. – కొండాపూర్, జూన్ 23